సాక్షి
కుమురం భీం
సోమవారం ၊ 21 ၊ జూలై ၊ 2025



ముల్తానీలు వర్సెస్ అటవీశాఖ

ఇచ్చోడ మండలం సిరిచెల్మ అటవీ పరిధిలో ముల్తానీలు సాగు చేస్తున్న పోడు భూములు వివాదాస్పదంగా మారాయి. 8లో▸



ఘనంగా బోనాల పండుగ

జిల్లాలో బోనాల పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. 9లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 30.0 /25.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేటి బంద్‌కు మద్దతు

కాగజ్‌నగర్‌టౌన్: ఆదివాసీ సంఘాలు జీవో నం.49 రద్దు కోసం సోమవారం తలపెట్టిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బంద్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరిస్తుందని, ఆసిఫాబాద్ జిల్లాలోని అటవీ ప్రాంతాలను టైగర్ కన్జర్వేషన్ ఫారెస్టుగా ప్రకటించడం అన్యాయమన్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీలకు కనీసం సమాచారం ఇవ్వకుండా నిర్ణయం తీసుకోవడం దారుణమని విమర్శించారు. ఆదివాసీలు తలపెట్టిన బంద్ కు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. ఈ బంద్‌లో వ్యాపారస్తులతో పాటు నాయకులు, కార్యకర్తలు, ప్రజాసంఘాలు, విద్యాసంస్థలు స్వచ్ఛందంగా పాల్గొనాలని కోరారు.

నిధులు మంజూరు చేయాలని వినతి



మంత్రి లక్ష్మణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న విశ్వప్రసాదరావు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని ఆసిఫాబాద్ మున్సిపాలిటీకి ఎస్‌టీఎస్‌డీఎఫ్ నిధులు మంజూరు చేయాలని కోరుతూ డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాదరావు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఆదివాసీలను అడవి నుంచి దూరం చేసే జీవో 49 రద్దు చేయాలని, నియోజకవర్గంలోని ఎస్టీ గ్రామాల్లో కమ్యునిటీ స్కూళ్లు మంజూరు చేయాలని, గురుకులాల్లో సీట్లు పెంచాలని, ఐటీడీఏలను బలోపేతం చేసి, స్థానిక ఆదివాసీలతో ఖాళీలు భర్తీ చేయాలని కోరారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియామకం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె. శ్రీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. 2025 –26 విద్యా సంవత్సరానికి గాను దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. తెలుగు 1, ఇంగ్లిష్ 2, కామర్స్ 2, బోటనీ 2, జువాలజీ 1, పొలిటికల్ సైన్స్ 2, హిస్టరీ 2, ఎకనామిక్స్ 1, కంప్యూటర్ సైన్స్ 2 ఖాళీలు ఉన్నాయని, అభ్యర్థులు పీజీలో 55శాతం, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 50శాతం మార్కులు కలిగి ఉండాలన్నారు.పీహెచ్‌డీ, నెట్, సెట్ ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 25లోపు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అపార్‌లో ఆలస్యం

- ప్రతీ విద్యార్థికి యూనిక్ నంబర్
- సాంకేతిక చిక్కులతో ప్రక్రియ జాప్యం
- ఆధార్.. అడ్మిషన్ వివరాల్లో తేడా
- జిల్లాలో 86,878 మంది విద్యార్థులు



ఆసిఫాబాద్‌రూరల్: జాతీయ విద్యావిధానంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఆధార్ తరహాలో ప్రతీ విద్యార్థికి అపార్‌కార్డులు జారీ చేయాలని నిర్ణయించింది. వన్ నేషన్ వన్ స్టూడెంట్ లక్ష్యంతో ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్, గురుకుల, కార్పొరేట్ విద్యాసంస్థల్లో కేజీ నుంచి పీజీ వరకు చదివే ప్రతీ విద్యార్థికి 12 అంకెలతో కూడిన ఆటోమెటెడ్ పర్మినెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ నంబర్‌ను కేటాయించాలని భావించింది. ఎంతో ఉన్నత లక్ష్యంతో 2023 అక్టోబర్ 18న ప్రారంభించిన ఈ కార్యక్రమానికి ఆది నుంచి అవాంతరాలు ఎదురవుతున్నాయి. గతేడాది చివరివరకు ఈ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉండగా ఆధార్‌కార్డులోని సమాచారం విద్యార్థుల అడ్మిషన్ రిజిస్టర్‌లోని వివరాలతో సరిపోలకపోవడంతో సాంకేతిక చిక్కులు ఎదురవుతున్నాయి. దీంతో నిర్ణీత సమయంలో నమోదు ప్రక్రియ పూర్తికావడం లేదు.

సమాచారంలో తేడాతో జాప్యం..

చైల్డ్ ఇన్ఫో వెబ్‌సైట్‌లో విద్యార్థుల సమగ్ర వివరాలు నమోదు చేసేందుకు పాఠశాలలకు ప్రత్యేక ఐడీలు ఉన్నాయి. వీటి ఆధారంగా కేంద్ర ప్రభుత్వం అపార్‌కార్డులు మంజూరు చేయనుంది. ఆధార్‌లోని సమాచారం విద్యార్థుల అడ్మిషన్ రిజిస్టర్‌లోని వివరాలతో సరిపోలకపోవడంతో సమస్యలు వస్తున్నాయి. దీంతో జిల్లాలో అపార్ నమోదు ప్రక్రియలో జాప్యం జరుగుతోంది. ఈ విద్యాసంవత్సరంలో 100 శాతం నమోదు పూర్తి చేస్తామని సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు. అపార్‌కార్డులో విద్యార్థుల సమగ్ర వివరాలు విద్యార్హతలు, గ్రేడ్లు, మార్కులు, సాధించిన ప్రగతి, ఉపకార వేతనాలు, ఇతర ధ్రువీకరణ పత్రాల సమాచారాన్ని, కుటుంబ సభ్యుల వివరాలను పొందుపరుస్తారు. ఉన్నత విద్యా ప్రవేశాలు, పోటీ పరీక్షలకు ఈ డిజిటల్ పత్రాలను ప్రామాణికంగా తీసుకోనున్నారు. ఇదిలా ఉండగా జిల్లాలోని 15 మండలాల పరిధిలో అన్ని యాజమాన్యాలు కలిపి 1,261 పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 86,878 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఇప్పటివరకు 45,039 మంది విద్యార్థుల వివరాలు అపార్‌లో నమోదు కాగా 41,335 మంది విద్యార్థుల వివరాలు ఇంకా నమోదు కావాల్సి ఉంది. మరో 504 మంది విద్యార్థుల నమోదులో లోపాలు తలెత్తాయి.

మండలాల వారీగా వివరాలు ఇలా....

మండలం	పాఠశాలలు	విద్యార్థులు	నమోదైన వారు	కావాల్సిన వారు
ఆసిఫాబాద్	151	13979	7551	6354
బెజ్జూర్	83	4264	1668	2573
చింతలమానెపల్లి	56	4080	1775	2296
దహెగాం	60	3601	1964	1629
జైనూర్	90	6768	3766	2963
కాగజ్‌నగర్	165	19854	11847	7870
కెరమెరి	97	4406	2398	1975
కౌటాల	64	5669	2532	3087
లింగాపూర్	48	1492	799	683
పెంచికల్‌పేట్	34	1937	1024	902
రెబ్బెన	73	4930	2533	2375
సిర్పూర్(టి)	67	5723	2846	2846
సిర్పూర్(యూ)	64	2405	996	1397
తిర్యాణి	104	2575	939	1627
వాంకిడి	105	5195	2401	2758
మొత్తం	1261	86878	45039	41335

ప్రక్రియ కొనసాగుతోంది



12 అంకెల అపార్ నమోదు ప్రక్రియ కొనసాగుతోంది. ప్రతీ విద్యార్థికి అపార్ నంబర్ తప్పకుండా ఉండాలి. నమోదు ప్రక్రియ సాంకేతిక కారణాలతో ఆలస్యమవుతోంది. విద్యార్థి సమగ్ర సమాచారం అపార్‌కార్డులో ఉంటుంది. భవిష్యత్తులో అపార్ అన్నింటికి ప్రామాణికం కానుంది.

– యాదయ్య, డీఈవో

ఇక ‘కొప్పుల’ శకం

- టీబీజీకేఎస్ ఇన్‌చార్జిగా నియామకం
- యూనియన్‌లో కవిత ఎపిసోడ్ క్లోజ్
- పొమ్మన లేక పొగ బెట్టారని ప్రచారం
- నేడు గోదావరిఖనిలో ఈశ్వర్ పర్యటన



కొప్పుల ఈశ్వర్

శ్రీరాంపూర్: టీబీజీకేఎస్ ఇన్‌చార్జిగా మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్ నియామకంతో ఆ యూనియన్ కొత్త జవసత్వాలు నింపుకోబోతోంది. ఇటీవల బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అధ్యక్షతన హైదరాబాద్‌లో జరిగిన టీబీజీకేఎస్ ముఖ్యనేతల సమావేశంలో యూనియన్ ఇన్‌చార్జిగా కొప్పుల ఈశ్వర్‌ను నియమించిన విషయం తెలిసిందే. కొప్పులకు ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన అనుభవంతో పాటు గతంలో సింగరేణి కార్మికునిగా పనిచేసిన అనుభవం ఉంది. క్షేత్రస్థాయిలో కార్మికులతో సంబంధం ఉన్న ఆయనకు యూనియన్ బాధ్యతలు అప్పగించడంపై గులాబీ శ్రేణుల్లో హర్షం వ్యక్తమవుతోంది. బాధ్యతలు చేపట్టిన తరువాత మొదటిసారిగా ఆయన సోమవారం గోదావరిఖని ఏరియాలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా భారీ బైక్ ర్యాలీ నిర్వహించనున్నారు. అనంతరం రాజ్యలక్ష్మి ఫంక్షన్‌హాల్‌లో సింగరేణి స్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. దీనికి కంపెనీ వ్యాప్తంగా అన్ని ఏరియాల నుంచి బ్రాంచినేతలు, పిట్ నేతలు, కేంద్ర కమిటీ నాయకులు హాజరు కానున్నారు.

పొమ్మన లేక...పొగబెట్టి

టీబీజీకేఎస్ గౌరవాధ్యక్షురాలిగా ఉన్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను పొమ్మన లేక పొగబెట్టినట్లు ప్రచారం జరుగుతోంది. 2014 నుంచి ఆమె యూనియన్ గౌరవాధ్యక్షురాలిగా ఉన్నారు. 13 ఏళ్లుగా యూనియన్ ఆధిపత్యం చెలాయిస్తున్న ఆమె స్థానాన్ని భర్తీ చేసేలా నేడు 'కొప్పుల'కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించడం చర్చనీయాంశమైంది. కవితను గౌరవాధ్యక్షురాలిగా తొలగించినట్లు అధికారికంగా ప్రకటించకపోయినా ఇన్‌చార్జి నియామకంతో ఆమెను నైతికంగా తప్పించినట్లేనని యూనియన్ నేతలు భావిస్తున్నారు. కాగా, కొంత కాలంగా పార్టీ నాయకత్వంపై కల్వకుంట్ల కవిత తీవ్ర విమర్శలు చేస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో తెలంగాణలో అతి పెద్ద ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణిలో తనపట్టు కాపాడుకునేందుకు ఆమె పార్టీ, యూనియన్‌తో సంబంధం లేకుండా సింగరేణి జాగృతి విభాగం ఏర్పాటు చేశారు. దీనికి 11 ఏరియాల ఇన్‌చార్జీలనూ నియమించింది. ఆ తరువాత శ్రీరాంపూర్ లాంటి ఏరియాల్లో స్వయంగా పర్యటించారు. సింగరేణి జాగృతి నాయకుల ఇళ్లకు వెళ్లినా ఆమెకు టీబీజీకేఎస్ నేతల మద్దతు లభించలేదు. పార్టీ నుంచి ఆమె దూరం అవుతుందనే భావనతో యూనియన్ నేతలెవ్వరూ ఆమె కార్యక్రమంలో పాల్గొనలేదు. దీంతో టీబీజీకేఎస్‌లో మార్పులు జరుగబోతాయనే సంకేతాలు అప్పుడే రాగా, తాజాగా కొప్పుల ఈశ్వర్ నియామకంతో తేటతెల్లమైంది.

పుట్టి ముంచింది పార్టీనే..

తెలంగాణ వాదంతో సింగరేణిలో పురుడు పోసుకుని జాతీయ సంఘాలకు దీటుగా నిలబడి రెండు పర్యాయాలు గుర్తింపు సంఘంగా గెలిచిన టీబీజీకేఎస్ రెండేళ్లుగా చతికిలా పడింది. ట్రేడ్ యూనియన్‌ను స్వతంత్రంగా ఉంచి పని చేయించాల్సిన బీఆర్‌ఎస్ యూనియన్ వ్యవహారాల్లో అతిగా జోక్యం చేసుకుని చివరికి పుట్టిముంచిందనే వాదనలు ఉన్నాయి. గత గుర్తింపు సంఘం ఎన్నికల్లో పోటీ చేస్తే ఓడిపోతామని పార్టీ చేసిన సర్వేలో తేలడంతో పోటీ చేయలేమని ముందుగా ప్రకటించడంతో తీవ్ర మనస్తాపం చెంది అప్పటి యూనియన్ అధ్యక్షుడు బీ వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య రాజీనామా చేసి పక్కకు తప్పుకొన్నారు. తీరా తేరుకొని ఎన్నికలకు కొద్దిరోజుల ముందు టీబీజీకేఎస్ పోటీకి సై అన్నప్పటికీ ఫలితాల్లో నాలుగోస్థానంలో నిలిచింది. తరువాత నాయకులు, కార్యకర్తలు చెల్లాచెదురై ఇతర సంఘాల్లో చేరిపోయారు. దీనికి కారణం పార్టీ నాయకత్వం, కల్వకుంట్ల కవిత కూడా బాధ్యురాలేనని విమర్శలు వచ్చాయి. ఏది ఏమైనా కొప్పుల ఈశ్వర్ సారథ్యంలో యూనియన్ బలపడే అవకాశాలు ఉంటాయని క్యాడర్ ఆశతో ఉంది.

గోలేటిలో ‘తీజ్’ సందడి



జగదాంబ ఆలయంలో తీజ్ బుట్టలతో యువతులు

రెబ్బెన: లంబాడీలు తరతరాలుగా జరుపుకుంటున్న తీజ్ ఉత్సవాలను ఆదివారం మండలంలోని గోలేటి విలేజ్‌లో ఘనంగా నిర్వహించారు. పెళ్లికాని యువతులు గ్రామం పచ్చదనంతో నిండాలని, పంటలు సంవృద్ధిగా పండాలని, మంచి భర్త దొరకాలని ఈ పండుగ జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. గత తొమ్మిది రోజుల నుంచి గ్రామంలోని పెళ్లి కాని యువతులతో పాటు ఇతర గ్రామాలకు చెందిన యువతులు వెదురుతో తయారు చేసిన బుట్టల్లో పుట్టమట్టి, నల్లమట్టి వేసి గోధుమ గింజలను నాటి తీజ్ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఆదివారం తొమ్మిదో రోజున గ్రామంలోని జగదాంబ ఆలయంలో గన్‌గోర్ ప్రతిమలను తయారు చేసి గన్‌గోర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయంలో సంప్రదాయబద్ధంగా బోగ్‌బండార్ పూజలు నిర్వహించారు. అనంతరం తీజ్‌బుట్టలతో ర్యాలీగా తరలివెళ్లి గ్రామానికి సమీపంలో ఉన్న చెరువులో నిమజ్జనం చేశారు. గ్రామపెద్దలు అజ్మీర బలరాం నాయక్, లావుడ్య దుప్పానాయక్, బిక్కు నాయక్, జర్పుల రాజు నాయక్, అజ్మీర బాబురావు, రమేశ్, లోకయ్య, శంకర్, లావుడ్య శంకర్, దేవయ్య, అజ్మీర తిరుపతి, సంజీవ్, లావుడ్య మోహన్ నాయక్, తారాచంద్, రవినాయక్, దస్రునాయక్, మోతీలాల్ తదితరులు పాల్గొన్నారు.

‘సరిహద్దు’ తిప్పలు..!

- మహారాష్ట్రకు ఆనుకుని పలు గ్రామాలు
- కనీస వసతులకు నోచుకోని వైనం
- విద్య, వైద్యసేవలు కరువు
- పట్టించుకోని అధికారులు



చింతలమానెపల్లి మండలంలోని గూడెం గ్రామం

చింతలమానెపల్లి: సిర్పూర్ నియోజకవర్గంలోని చింతలమానెపల్లి, బెజ్జూర్, పెంచికల్‌పేట్, దహెగాం మండలాల్లోని పలు గ్రామాలు మహారాష్ట్రకు సరిహద్దుగా ఉన్నాయి. ఆయా గ్రామాలు సరిహద్దుల్లో ఉండడంతో రవాణా, విద్య, వైద్యం వంటి కనీస వసతులకు కూడా నోచుకోవడం లేదు. అక్కడి వారికి పౌరసేవలు సైతం పూర్తిస్థాయిలో అందని పరిస్థితి ఉంది.

సరిహద్దు గ్రామాలు..

మహారాష్ట్రకు సరిహద్దుగా చింతలమానెపల్లి మండలంలోని దిందా, చిత్తాం, గూడెం, కోయపెల్లి, బూరుగూడ, శివపెల్లి, కేతిని గ్రామాలు ఉన్నాయి. ఇవి మండల కేంద్రానికి 15 నుంచి 25 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. బెజ్జూర్ మండలంలో సోమిని, తలాయి, మొగవెల్లి, గెర్రెగూడెం, ఇప్పలగూడెం, తిక్కపల్లి, భీమారం గ్రామాలు ఉండగా ఇవి మండల కేంద్రానికి 12 నుంచి 18 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. పెంచికల్‌పేట్ మండలంలో మొర్లిగూడ, జిల్లెడ, నందిగామ, కమ్మర్గాం, గుండెపల్లి గ్రామాలు సరిహద్దులో ఉన్నాయి. పెంచికల్‌పేట్ నుంచి 15 నుంచి 20 కిలోమీటర్ల దూరంలో ఇవి ఉన్నాయి. దహెగాం మండలంలో మొట్లగూడ, రాంపూర్, దిగిడ, రావులపల్లి సరిహద్దు గ్రామాలు ఉండగా మండల కేంద్రం నుంచి 25 నుంచి 28 కిలోమీటర్ల దూరంలో ఈ గ్రామాలు ఉన్నాయి. ఆయా గ్రామాలు ఆయా మండల కేంద్రాలకు దూరంగా ఉండడంతో అభివృద్ధి కానరావడం లేదు.

సౌకర్యాలు కల్పించాలని డిమాండ్

రాష్ట్రంలో జిల్లాలు, మండలాల పునర్విభజన జరిగింది. కొత్తగా గ్రామపంచాయితీలు ఏర్పడ్డాయి. కానీ గ్రామాలలో ఏర్పాటైన వసతుల కల్పన నేటికీ పాత మండలాల పరిధిలోనే ఉంది. నూతనంగా ఏర్పాటైన మండలాల ప్రాతిపదికన ఈ సరిహద్దు గ్రామాలలో సర్వేలు నిర్వహించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. అవసరమైన చోట ప్రజలకు అందుబాటులో ఉండేలా ఉన్నత పాఠశాలలు, ఆరోగ్యకేంద్రాలు, విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు

అభివృద్ధికి దూరంగా..



పెంచికల్‌పేట్ మండలంలోని మొర్లిగూడ గ్రామానికి వెళ్లే దారి

- చింతలమానెపల్లి మండలంలోని గూడెం గ్రామం మండల కేంద్రం నుంచి 18 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇటీవల ప్రాణహిత నదిపై వంతెన నిర్మాణంతో గ్రామం అభివృద్ధి బాట పడుతోంది. కానీ ఈగ్రామంలో విద్యార్థులు 9, 10వ తరగతులు చదువుకోవాలంటే మండల కేంద్రానికి రావాల్సిందే. గ్రామానికి చుట్టుపక్కల ఉన్న గ్రామాల వారిదీ ఇదే పరిస్థితి. స్థానిక ఆరోగ్య ఉపకేంద్రం పెంచికల్‌పేట్ పీహెచ్‌సీ పరిధిలో ఉండడంతో స్థానికులు మహారాష్ట్ర వైద్య సేవలపై ఆధారపడుతున్నారు. కాగా నేటి వరకు గ్రామంలో 3ఫేస్ విద్యుత్ సౌకర్యం లేదు. ఇటీవల ఇక్కడ పర్యటించిన ఎమ్మెల్యే హరీశ్‌బాబు స్పందిస్తూ త్వరలో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం చేపడుతామన్నారు. గూడెం, పరిసర గ్రామాల సౌలభ్యం కోసం పీహెచ్‌సీ మంజూరుకు, 10వ తరగతి వరకు పాఠశాల అప్‌గ్రేడ్ చేయాలని కోరుతూ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించారు. గూడెం గ్రామం వరకు రహదారి అధ్వానంగా ఉండగా అటవీ అనుమతులు లేక మరమ్మతులు చేపట్టడం లేదని అధికారులు పేర్కొంటున్నారు.
- దహెగాం మండలంలోని సరిహద్దు గ్రామాల ప్రజలు ఏ చిన్న అవసరానికైనా 25 కిలోమీటర్లకు పైగా ప్రయాణించి దహెగాం రావాల్సిందే. మండల కేంద్రం నుంచి ఖర్జి వరకు రహదారి ఉన్నా అధ్వానంగా ఉంది. మండలంలోని సరిహద్దు గ్రామాలకు 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న చినరాస్పల్లిలో ఉన్నత పాఠశాల ఉంది.
- పెంచికల్‌పేట్ మండలంలోని మొర్లిగూడ, జిల్లెడ, నందిగామ, కమ్మర్గాం, గుండెపల్లి గ్రామాలకు వర్షాకాలం రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఇక్కడి ప్రజలకు 108 సేవలు కూడా అందవు. కనీసం ఫోన్ సిగ్నల్ కూడా రాక నానా అవస్థలకు గురవుతున్నారు.
- బెజ్జూర్ మండలంలోని సరిహద్దు గ్రామాలకు వర్షాకాలంలో వాగులు, కాలువలు ప్రవహించి రాకపోకలు నిలిచిపోతున్నాయి. విద్యాపరంగా సుశ్మీర్‌లో ఉన్నత పాఠశాల ఉండగా, రవాణా, వైద్యం పరంగా మాత్రం ఎలాంటి వసతులు లేవు.

ఆదివాసీ గ్రామాలే అధికం..



మండల కేంద్రానికి దూరంగా ఉన్న గ్రామాలలో ఆదివాసీ గ్రామాలే ఎక్కువ. కనీస వసతులు లేక ఆయా గ్రామాల్లో ఆదివాసీలు ఇబ్బందులు పడుతున్నారు. విద్య, వైద్యం అందుబాటులో లేవు. రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. అధికారులు చర్యలు తీసుకోవాలి.

– బుర్రి రూపేశ్, ఆదివాసీ విద్యార్థి నాయకుడు

కనీస వసతులు కల్పించాలి



మా గ్రామంలో వసతులు లేక పొరుగున ఉన్న మహారాష్ట్రకు వైద్యం కోసం వెళ్తున్నాం. మండల కేంద్రం నుంచి దూరంగా ఉన్న గ్రామాలలో విద్య, వైద్యం, విద్యుత్ వంటి సౌకర్యాలు లేక అనేక అవస్థలు పడుతున్నాం. ప్రభుత్వం కనీస వసతులు కల్పించాలి.

– ప్రణయ్ నామెవార్, గూడెం

‘ఉపాధి’ డబుల్ హాజరు!

- రెండు పూటలా ఆన్‌లైన్‌లో నమోదు
- అక్రమాలకు చెక్ పెట్టేందుకు నిర్ణయం
- ఆరు నెలలకోసారి సామాజిక తనిఖీ
- అమలుకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం



ఎల్లూర్‌లో ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

పెంచికల్‌పేట్: గ్రామీణ ప్రాంతాల్లో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం నూతన విధానానికి శ్రీకారం చుట్టింది. ఉపాధిహామీ పథకంలో అక్రమాలు అరికట్టడానికి, జవాబుదారీతనం పెంపొందించడానికి ప్రత్యేక సంస్కరణలు చేపట్టింది. గ్రామాల్లో నిర్వహిస్తున్న సామాజిక తనిఖీ వేదికల్లో అక్రమాలు వెలుగుచూస్తున్న నేపథ్యంలో వాటిని అరికట్టడానికి ఉపాధి కూలీల హాజరును పని ప్రదేశంలో రెండు పూటలా ఆన్‌లైన్‌లోనే తీసుకుంటోంది. మరో వైపు ఏడాదికి ఒకసారి నిర్వహించే ఉపాధిహామీ సామాజిక తనిఖీలను ఆరు నెలలకు ఒకసారి నిర్వహించేందుకు ఆదేశాలు జారీ చేసింది.

ఎన్‌ఎంఎంఎస్ యాప్ ద్వారా ఫొటోలు..

ఉపాధిహామీ పథకంలో కూలీల హాజరు విధానాన్ని ఆన్‌లైన్ ద్వారా చేపట్టింది. కేంద్రం తీసుకొచ్చిన ఎన్‌ఎంఎంఎస్ (నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం) యాప్‌లో ప్రతీరోజు ఉదయం కూలీల ఫేస్ రికగ్నేషన్ ద్వారా హాజరు తీసుకుంటున్నారు. అయితే పనికి ఆలస్యంగా వచ్చిన కూలీలు సైతం ముందు వచ్చిన కూలీలతో సమానంగా కూలి తీసుకుంటున్నట్లు అధికారుల దృష్టికి వచ్చింది. దీంతో పథకం అమలు, కూలీల కూలి చెల్లింపులో కేంద్ర ప్రభుత్వం నూతన మార్గదర్శకాలు విడుదల చేసింది. పని ప్రదేశంలో ఉదయం పనికి వచ్చిన కూలీ ఫొటో, హాజరు, పని మొదటి ఫొటో తీసుకుని నాలుగు గంటల తరువాత మరో ఫొటో తీసుకోనున్నారు. రెండు పూటలా ఫొటో హాజరు ఉంటే మాత్రమే కూలీలకు రూ.307 కూలి చెల్లిస్తున్నారు. ఒకే ఫొటో ఉంటే సగం కూలి మాత్రమే చెల్లిస్తున్నారు. ఎన్‌ఎంఎంఎస్ యాప్‌లో కూలీల ఫొటోలను పంచాయతీ కార్యదర్శులు తీస్తున్న క్రమంలో ఫొటోలను పంచాయతీ కార్యదర్శి నుంచి రాష్ట్రస్థాయి అధికారులు సైతం తనిఖీ చేయాల్సి ఉంటుంది.

జిల్లా వివరాలు (20, జూలై, 2025 వరకు)..	జాబ్ కార్డులు 1,23,123		
	కూలీలు 2,44,358	పని డిమాండ్ చేసిన కూలీలు 1,29,012	పని చేసిన కూలీలు 1,28,965
	మొత్తం పని దినాలు 20,96,589		

రెండుసార్లు తనిఖీ..

ప్రభుత్వం ఉపాధిహామీ పనులను తనిఖీ చేయడానికి ఏటా సామాజిక తనిఖీ గ్రామసభల అనంతరం ప్రతీ మండల కేంద్రంలో మండల సామాజిక తనిఖీ ప్రజావేదికలు నిర్వహిస్తోంది. సంవత్సర కాలంలో కూలీలు చేసిన పనులు, చెల్లించిన నగదును పరిశీలించి నివేదికలు సిద్ధం చేసి వేదికల్లో వినిపిస్తున్నారు. ఏడాదికి ఒకసారి నిర్వహించే సామాజిక తనిఖీలను ఇక నుంచి ఆరు నెలలకు ఒకసారి నిర్వహించాలని కేంద్రం ఆదేశాలు జారీ చేసింది.

ఫొటో హాజరుతో ఇబ్బందులు



అధికారులు పని ప్రదేశంలో రెండు పుటలా ఉపాధిహామీ కూలీల ఫొటోలు తీస్తున్నారు. ఉదయం పని ప్రారంభించిన సమయంలో ఒకసారి, నాలుగు గంటల తరువాత మరో ఫొటో తీస్తున్నారు. ఫొటో హాజరు కోసం గంటల తరబడి వేచి ఉంటున్నాం. అధికారులు పాత పద్ధతి కొనసాగించాలి.

– పుల్గం బాపూజీ, పెంచికల్‌పేట్

అమలుకు ప్రత్యేక చర్యలు..

ఉపాధిహామీ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం గతంలోనే ఆదేశాలు జారీ చేసింది. కూలీల చెల్లింపుల్లో అక్రమాలకు పాల్పడకుండా రెండు పూటలా యాప్‌లో ఫొటో హాజరు తీసుకుంటున్నాం.

– దత్తరాం, డీఆర్‌డీవో

క్లుప్తంగా

నిలకడగా 'కడెం' నీటిమట్టం


కడెం ప్రాజెక్ట్

కడెం: కడెం ప్రాజెక్ట్ నీటిమట్టం నిలకడగా కొనసాగుతుంది. ఆదివారం ప్రాజెక్ట్‌కు 1291 క్యూసెక్కుల స్వల్ప ఇన్‌ఫ్లో వస్తుంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులు కాగా, ప్రస్తుతం 694.6 50 అడుగులు ఉందని ఇరిగేషన్ అధికారులు పేర్కొన్నారు.

ఎడ్లు, ఆవు దూడ చోరీ

ఇంద్రవెల్లి: మండలంలోని దేవాపూర్‌లో ఎడ్ల జత, ఆవు దూడ చోరీకి గురైందని ఏఎస్సై కొండరి రమేశ్ తెలిపారు. రైతు కాంబ్లే గణేశ్ శనివారం సాయంత్రం ఎడ్లు, ఆవు దూడల ను కొట్టంలో కట్టి ఉంచారు. ఆదివారం ఉద యం లేచి చూసేసరికి లేకపోవడంతో వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలి పారు.

షార్ట్ సర్క్యూట్‌తో షెడ్డు, గుడిసె దగ్ధం


దగ్ధమైన షెడ్డు, గుడిసె

ఉట్నూర్‌రూరల్: మండలంలోని దంతన్‌పల్లిలో శనివారం రాత్రి షార్ట్ సర్క్యూట్‌తో పిండిగిర్నీలో మంటలు చెలరేగి రేకుల షెడ్డు, పూరి గుడిసె దగ్ధమైంది. విషయం తెలుసుకున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ఆ దివారం ఘటన స్థలానికి చేరుకుని బాధితుడు ఏనాగుర్తి గౌరీశంకర్‌ను పరామర్శించారు. ప్రభుత్వపరంగా సహాయం అందిస్తానని హామీఇచ్చారు. తనవంతుగా రూ.5 వే ల ఆర్థికసాయం అందించారు. కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు ఉన్నారు.

గుడుంబా తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

ఆసిఫాబాద్‌రూరల్: గుడుంబా తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్ తెలిపారు. ముందస్తు సమాచారంతో మండలంలోని సాలెగూడలో నాగోస్ విక్రమ్ ఆదివారం ఇంట్లో దాడి చేసి 12 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ పేర్కొన్నారు. ఈ దాడిలో కానిస్టేబుళ్లు దేవేంద్ర కుమార్, సంజీవ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

దండేపల్లి: మండల కేంద్రంలోని యాదవ సంఘం భవన సమీపంలో ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి..అతి వేగంగా వచ్చిన కారు స్కూటీని ఢీకొట్టడంతో స్కూటీపై ప్రయాణిస్తున్న ఎల్లయ్యపల్లెకు చెందిన సురేష్, నవనీత అనే బాలికకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం లక్సెట్టిపేటకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కరీంనగర్‌కు రెఫర్ చేసినట్లు ఎస్సై తహసీనొద్దీన్ తెలిపారు.

వికసించిన బ్రహ్మకమలం



బోథ్: హిమాలయ పర్వత ప్రాంతాల్లో కనిపించే బ్రహ్మ కమలం పువ్వు బోథ్‌కు చెందిన రాయిపల్లి నందన, మధుకర్ దంపతుల ఇంట్లో వికసించింది. మూడేళ్లుగా ఇంట్లో పెంచుతున్న బ్రహ్మకమలం మొక్క శనివారం రాత్రి 8 నుంచి 12 గంటల వరకు విరబూసింది. ఈ దృశ్యాన్ని చూసేందుకు బంధువులు, పొరుగువారు తరలివచ్చారు. మధుకర్ కుటుంబీకులు పూజలు, దీపారాధనలు నిర్వహించారు.

ముల్తానీలు వర్సెస్ అటవీశాఖ

- వివాదాస్పదంగా పోడు భూములు
- మొక్కలు నాటడాన్ని అడ్డుకున్న వైనం
- అటవీ భూములంటున్న అధికారులు
- రెండేళ్లుగా కొనసాగుతున్న పంచాయితీ


సిరిచెల్మ అటవీ ప్రాంతంలో చెలుకగూడ వద్ద మొక్కలు నాటుతున్న అటవీ సిబ్బంది (ఫైల్)

ఇచ్చోడ: మండలంలోని సిరిచెల్మ అటవీ పరిధి చెలుకగూడ అటవీప్రాంతంలో కేశవపట్నం, జోగిపేట్ గ్రామాలకు చెందిన ముల్తానీలు సాగు చేస్తున్న వంద ఎకరాల పోడు భూములు వివాదాస్పదంగా మారాయి. టైగర్‌జోన్ పరిధి అటవీప్రాంతంలో విలువైన టేకు చెట్లు నరికివేసి మైదానంగా మార్చి కొందరు అక్రమంగా సాగు చేస్తున్నారని జిల్లా ఉన్నతాధికారులు గుర్తించారు. అటవీ ప్రాంతంలో మొక్కలు నాటాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ముల్తానీలు అడ్డుకుంటున్నారు. గత రెండేళ్లుగా అటవీశాఖ, ముల్తానీల మధ్య పంచాయితీ కొనసాగుతోంది. పోలీసు బందోబస్తు మధ్య అటవీ అధికారులు మొక్కలు నాటుతుంటే తరచూ అడ్డుకుంటున్నారు. అటవీ, పోలీసు శాఖలకు తలనొప్పిగా మారింది.

తరచూ ఘటనలు

గతేడాది ముల్తానీలు సాగు చేస్తున్న పోడు భూముల్లో అటవీ అధికారులు భారీగా మొక్కలు నాటారు. కొంత మంది ముల్తానీలు ఆ సమయంలో జేసీబీకి నిప్పంటించడంతో పాక్షికంగా దగ్ధమైంది. పలువురిపై కేసులు నమోదయ్యాయి. ఈనెల 1న పోడు భూముల్లో అధికారులు మొక్కలు నాటేందుకు తవ్విన గుంతలను ముల్తానీలు పూడ్చివేశారు. ఈనెల 5న మొక్కలు నాటేందుకు వెళ్తున్న అటవీ అధికారులను సిరిచెల్మ ఘాట్ రోడ్డు వద్ద అడ్డుకున్నారు. 8 మందిపై కేసులు నమోదయ్యాయి. ఈనెల 19న అటవీశాఖ అధికారులు మొక్కలు నాటుతున్న ప్రాంతానికి ముగ్గురు మహిళలు అక్కడికి చేరుకుని ఇక్కడి నుంచి మీరు వెళ్లకపోతే కొడవలితో గొంతు కోసుకుంటామని హల్‌చేశారు. పోలీసులు వారిని స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం మహిళల కుటుంబీకులను పిలిపించి బయటకు పంపే ప్రయత్నంలో ముల్తానీలు పెద్ద ఎత్తున స్టేషన్‌కు చేరుకున్నారు. దీంతో కొంత ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. ఎట్టకేలకు మహిళలను బయటకు పంపించారు. ఆదివారం మొక్కలు నాటే క్రమంలో బందోబస్తు వెళ్లిన పోలీసులపై ముల్తానీలు మూకుమ్మడిగా రాళ్లతో దాడి చేశారు.

ఫుల్‌స్టాప్ పడేదెలా..

అటవీశాఖ, ముల్తానీల మధ్య వివాదాస్పదంగా మారిన అటవీ భూముల విషయంలో ఫుల్‌స్టాప్ పడేవిధంగా కలెక్టర్ చొరవ తీసుకోవాల్సిన అవసరం ఉంది. అటవీ ప్రాంతంలో చెట్లు నరికివేతకు గురైంది ఎప్పుడు, వాటిలో ముల్తానీలు ఎప్పటి నుంచి సాగు చేస్తున్నారు. వారికి సహకరించింది ఎవరు, వారి వద్ద ఉన్న ఆధారాలు, ముల్తానీల ఆందోళనల్లో రాజకీయ ప్రమేయం ఎంత అన్న కోణంలో జిల్లా ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపించాల్సిన అవసరం ఎంతైన ఉంది.

చర్యలు తీసుకుంటాం

అడవులను అక్రమించి భూములు సాగు చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. సిరిచెల్మ అటవీ ప్రాంతంలో 50 ఎకరాల వరకు మొక్కలు నాటాం. కొందరు ముల్తానీలు అడ్డుకోవడంతో కొంత ఆలస్యం జరుగుతుంది. ఉన్నతాధికారుల ఆదేశాలతో చర్యలు తీసుకుంటాం.

– ప్రశాంత్ బాజీరావు పాటిల్ కథం, ఆదిలాబాద్ డీఎఫ్‌వో

'కుంటాల'కు జలకళ



నేరడిగొండ: ఇటీవల కురిసిన వర్షాలకు కుంటాల జలపాతం జలకళ సంతరించుకుంది. ఆదివారం సెలవు రోజు కావడంతో ప్రకృతి ప్రియులు జలపాతం అందాలను వీక్షించేందుకు పెద్దఎత్తున తరలివచ్చారు. ప్రకృతి సహజ సిద్ధమైన పచ్చని అడవితల్లి ఒడిలో సెలయేళ్ల పరవళ్లు తొక్కుతున్న జలధారాలు పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి. జలపాతం వద్ద ఫొటోలు, సెల్ఫీలు దిగుతూ సంబరాల్లో మునిగితేలారు.



సెలవుల్లో ఇంటికి వచ్చి మృత్యుఒడిలోకి

- బావిలో పడి ఇంటర్ విద్యార్థి మృతి

దండేపల్లి: హోంసిక్ సెలవుల్లో ఇంటికి వచ్చిన ఇంటర్ విద్యార్థి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఘటన మండలంలోని నంబాల గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై తహసీనొద్దీన్ కథనం ప్రకారం ..లక్సెట్టిపేటకు చెందిన రుద్ర వంశీకృష్ణ(16) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కాలేజీలో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్నాడు. హోంసిక్ సెలవుల్లో భాగంగా శనివారం లక్సెట్టిపేట ఇంటికి వచ్చాడు. దీంతో పల్లెలోని పంట పొలాలు చూసేందుకు ఆదివారం తెల్లవారు జామున స్నేహితులతో కలిసి బైక్‌లతో గూడెం–మేదరిపేట రింగురోడ్డు గుండా బయల్దేరారు. నంబాల సమీపానికి చేరుకోగా, వంశీకృష్ణ స్కూటీ రోడ్డుపక్కన ఉన్న మట్టికుప్పను ఢీకొట్టి పక్కనున్న వ్యవసాయ బావిలో ప్రమాదవశాత్తు పడిపోయాడు. ఈత రాకపోవడంతో మునిగి చనిపోయాడు. స్కూటీ వెనకాల కూర్చుని ఉన్న స్నేహితుడు వర్షిత్ వర్మ మట్టికుప్పపై పడటంతో గాయాలయ్యాయి. వెనకాల మరో బైక్‌పై వస్తున్న మిగతా మిత్రులు ఈ విషయాన్ని గమనించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. వా రంతా ఘటన స్థలానికి చే రుకున్నారు. మృతుడి తల్లి నా గమణి ఫిర్యాదుతో కేసు ద ర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు. కాగా, వంశీతోపాటు మరికొంతమంది మిత్రులు బైక్ రేస్ చేస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి.


వంశీకృష్ణ (ఫైల్)

పది నెలల క్రితం గుండెపోటుతో తండ్రి..

వంశీకృష్ణ తండ్రి రవికుమార్ కారు మెకానిక్‌గా పనిచేస్తూ, పది నెలల క్రితం గుండెపోటు మృతిచెందాడు. ఇప్పుడు అతని చిన్న కొడుకు వంశీకృష్ణ ప్రమాదవశాత్తు బావిలో పడి చనిపోవడంతో ఆ ఇంట్లో తీరని విషాదం నెలకొంది. పది నెలల వ్యవధిలో తండ్రి, కొడుకు చనిపోవడంతో కుటుంబీకులు కన్నీరు మున్నీరవుతున్నారు. సెలవులు రాకపోయిన బతికేటోడని కుటుంబీకులు, బంధువుల రోదనలు పలువురిని కంటతడి పెట్టించాయి.

అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య

కుంటాల: కొత్త ఇంటి నిర్మాణానికి చేసిన అప్పులు తీర్చలేనన్న బెంగతో మద్యానికి బానిసై వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై అశోక్ కథనం ప్రకారం.. మండలంలోని విఠాపూర్‌కు చెందిన వెంగళం సాయినాథ్(38) పదేళ్ల క్రితం బతుకుదెరువు కోసం కల్లూరు గ్రామానికి వచ్చి వడ్రంగి పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. కల్లూరులో సొంత ఇంటి నిర్మాణ కోసం రూ.10 లక్షల వరకు అప్పులు చేశాడు. ఈక్రమంలో మద్యానికి బానిసయ్యాడు. అప్పులు ఎలా తీర్చేదనని మనస్తాపం చెందాడు. శనివారం రాత్రి కొత్త ఇంట్లో ఉరేసుకున్నాడు. ఆదివారం ఉదయం సాయినాథ్ చిన్న కుమారుడు ఆడుకుంటూ వంటగదికి వెళ్లగా తండ్రి విగతజీవిగా శవమై కనిపించాడు. ఈ విషయాన్ని కుటుంబీకులు, పోలీసులకు సమాచారం అందుకున్నారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహానికి పంచనామా నిర్వహించారు. భార్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు.


సాయినాథ్ (ఫైల్)

పురుగుల మందు తాగి యువకుడు..

కుభీర్: మద్యం మత్తులో పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై క్రిష్ణారెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని పార్డి(కె) గ్రామానికి చెందిన మెటిపల్లి శ్రీనివాస్(32)– గంగాసాగర దంపతులు. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. శ్రీనివాస్ హైదరాబాద్‌లో 108లో పనిచేసేవాడు. గత 15రోజుల క్రితం భార్యభర్తల మధ్య గొడవ జరిగింది. ఈక్రమంలో భార్య తల్లిగారింటికి వెళ్లిపోయింది. శ్రీనివాస్ స్వగ్రామమైన పార్డి(కె)కు వచ్చాడు. అప్పటి నుంచి మద్యం తాగుతున్నాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెందాడు. శనివారం రాత్రి గ్రామశివారులోని రేకుల షెడ్డులో మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.


శ్రీనివాస్ (ఫైల్)

లక్ష్మీపూర్‌లో వివాహిత..

సిరికొండ: మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన వివాహిత గురుజల చిట్టి శనివారం రాత్రి పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు రిమ్స్‌కు 108 వాహనంలో తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. కాగా, ఆమె ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

మద్యానికి బానిసై వృద్ధుడు..

తానూరు: మద్యానికి బానిసై వృద్ధుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై షేక్ జుబేర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..మండలంలోని భోసి గ్రామానికి చెందిన చిక్కల్‌వార్ సురేశ్ (60) టైలరింగ్ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొన్నేళ్లుగా అనారోగ్యం బారినపడి వైద్య చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో అతని భా ర్య గంగాసాగర అనారోగ్యం పాలైంది. ఈక్రమంలో సురేశ్ మద్యానికి బానిసయ్యాడు. తన భార్య, తాను అనారోగ్యం బారినపడడంతో మనస్తాపం చెందాడు. శనివారం రాత్రి మహాలింగి రోడ్డుకు ఉ న్న గుట్ట ప్రాంతానికి వెళ్లి చెట్టుకు ఉరేసుకున్నాడు. అక్కడ ఉన్న కొందరు గమనించి కుటుంబీకులకు సమాచారం అందించారు. వారు అక్కడి చేరుకుని అతన్ని భైంసా ఆస్పత్రికి తరలించే లోపు మృతిచెందాడు. భార్య ఫిర్యాదుతో ఆదివారం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు. మృతుడికి నలు గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

- బాలికల డబుల్స్‌లో రిదిమా దేవినేని, సరయు సూర్యనేని
- బాలుర డబుల్స్‌లో అమన్ అనీశ్, యూదజిత్‌రెడ్డి
- బాలికల సింగిల్స్‌లో ప్రసన్న బోనం
- బాలుర సింగిల్స్‌లో సాయి నచికేత్ విజయం


విజేతలకు మెడల్స్, ట్రోఫీలు అందజేస్తున్న ఎమ్మెల్సీ అంజిరెడ్డి, జిల్లా క్రీడల అధికారి శ్రీకాంత్‌రెడ్డి

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రం శివారు కొండాపూర్ వద్ద నిర్మల్ స్పోర్ట్స్ అకాడమీలో ఈనెల 17న ప్రారంభమైన రాష్ట్రస్థాయి అండర్–19 జూనియర్స్ బాల, బాలికల బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారం ముగిశాయి. మంచిర్యాల జిల్లా స్టార్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ముఖేశ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి పుల్లూరి సుధాకర్, రాష్ట్రస్థాయి పోటీల కన్వీనర్లు కిశోర్, వన్నెల భూమన్న నేతృత్వంలో పోటీలు నిర్వహించారు. 33 జిల్లాల నుంచి 300 మంది క్రీడాకారులు పాల్గొనగా 166 మంది క్వాలిఫై అయ్యారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అంజిరెడ్డి హాజరయ్యారు. కాసేపు క్రీడాకారులతో సరదాగా బ్యాడ్మింటన్ ఆడారు. ముందుగా ఫైనల్ మ్యాచ్‌లు నిర్వహించగా.. బాలికల డబుల్స్‌లో రంగారెడ్డి జిల్లాకు చెందిన రీదిమ దేవినేని, సరయు సూర్యనేని గెలుపొందారు. రన్నర్లుగా రంగారెడ్డి జిల్లాకు చెందిన చందన గుర్రం, వేదస్వి వాసిరెడ్డి నిలిచారు. బాలుర డబుల్స్‌లో రంగారెడ్డి జిల్లాకు చెందిన అమన్ అనీశ్, యూదజిత్‌రెడ్డి.. సంగారెడ్డి జిల్లాకు చెందిన గిరి వాసన్ సర్వానకుమార్, సాయి సిద్దార్థపై గెలుపొందారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో వరంగల్, రంగారెడ్డి జిల్లాలకు చెందిన శౌర్య కిరణ్, రిషిత పాండే.. రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాలకు చెందిన అమన్ అనీశ్, రియా సుశీల్‌పై గెలుపొందారు. బాలికల సింగిల్స్‌లో ఖమ్మం జిల్లాకు చెందిన ప్రసన్న బోనం.. రంగారెడ్డి జిల్లాకు చెందిన రిషిత పాండేపై విజయం సాధించారు. బాలుర సింగిల్స్‌లో సంగారెడ్డి జిల్లాకు చెందిన సాయి నచికేత్ బట్రాజ్.. వరంగల్ జిల్లాకు చెందిన అఖిల్‌రావు సూర్యనేనిపై గెలుపొందారు. విజేతలకు ఎమ్మెల్సీ అంజిరెడ్డి మెడల్స్, కప్‌లు అందజేశారు. తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ నుంచి వచ్చిన 10 మంది ఎంపైర్లు, రిఫరీ, మ్యాచ్ కంట్రోలర్‌ను సన్మానించారు.

క్రీడలు అంటే ఎంతో ఇష్టం

చిన్నప్పటి నుంచి తనకు క్రీడలు అంటే ఎంతో ఇష్టమని ఎమ్మెల్సీ అంజిరెడ్డి పేర్కొన్నారు. యుక్త వయసులో కబడ్డీ, బ్యాడ్మింటన్ తదితర క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొన్నట్లు చెప్పారు. రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించడానికి సహకరించిన నిర్మల్ స్పోర్ట్స్ అకాడమీకి అభినందనలు తెలిపారు. పీఈటీల వినతి మేరకు స్టేడియం నిర్మాణానికి కృషి చేస్తానని చెప్పారు. నిర్మల్ జిల్లా క్రీడాకారులకు తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. పోటీల్లో విజయం సాధించిన ప్రతి ఒక్కరికీ తనవంతుగా స్పోర్ట్స్ బ్యాగులు అందజేస్తానని పేర్కొన్నారు. జిల్లా క్రీడల శాఖ అధికారి శ్రీకాంత్‌రెడ్డి, కోఆర్డినేటర్లు సందీప్, మధుకర్‌గౌడ్, మహేశ్, ప్రణీత్, నందకుమార్, డాక్టర్లు అవినాష్, మనోజ్ భరత్, పీడీ భోజన్న, దీక్ష కాలేజ్ మేనేజ్‌మెంట్ వెంకట్‌రెడ్డి, ప్రమోద్‌రావు, పీఈటీలు పాల్గొన్నారు.

తండ్రిని బెదిరించిన కొడుకుపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: తండ్రిని చంపేస్తానని బెది రించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు టూ టౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన చిలకల ప్రణీత్ శనివారం రాత్రి ఒంటిగంట సమయంలో తండ్రి శ్రీనివాస్‌తో వాగ్వాదానికి దిగి దాడి చేశాడు. అక్కడే ఉన్న పెద్ద అద్దం ముక్కను కింద పడేసి, దానితో చంపేస్తానని బెదిరించాడు. అడ్డువచ్చిన తల్లిని బెదిరించినట్లు వెల్లడించారు. తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మహిళతో అసభ్యకరంగా మాట్లాడిన నకిలీ బాబాపై కేసు

ఇంద్రవెల్లి: మహిళతో అసభ్యకరంగా మాట్లాడిన నకిలీ బాబాపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై కొండరి రమేశ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని మెండపల్లి గ్రామానికి చెందిన మహిళకు వారం క్రితం తన కుమారుడికి జ్వరం వచ్చింది. కుమారుడిని తీసుకుని అదే గ్రామంలోని బాబా కొట్నాక్ శంకర్ వద్దకు వెళ్లింది. తన కుమారుడికి జ్వరం వస్తుంది..చూసి చెప్పు బాబాను అడిగింది. మీ ఇంట్లో మంత్రాలు చేశారు. అవి తీయాలంటే నాతో వివాహేతర సంబంధం పెట్టుకోవాలని నేను చెప్పినట్లు చేస్తే పూజలు చేసి మంత్రాలు తీసివేస్తానని చెప్పాడు. బాబా విషయాన్ని భార్య భర్తకు చెప్పింది. అప్పటి నుంచి భార్య నకిలీ బాబా వద్దకు వెళ్లకుండా చూశాడు. ఈనెల 19న ఉదయం నా భార్యతో ఎందుకు అసభ్యంగా మాట్లాడినవు అంటూ భర్త.. బాబాను నిలదీశారు. ఈక్రమంలో గొడవ జరిగింది. మళ్లీ సాయంత్రం బాబా కొట్నాక్ శంకర్ ఆ మహిళ ఇంటి సమీపంలోకి వచ్చి ఉన్నాడు. ఈలోగా భర్త వ్యవసాయ పని ముగించుకొని ఇంటికివస్తున్నాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. నీ అంతు చూస్తానని ఆమె భర్తను నకిలీ బాబా కత్తితో బెదిరించాడు. ఆదివారం భార్యాభర్తల ఫిర్యాదుతో కొట్నాక శంకర్‌పై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

మాయమాటలు చెప్పి..బంగారు గొలుసు చోరీ

నిర్మల్‌టౌన్: ఓ మహిళకు గుర్తుతెలియని వ్యక్తి మాయమాటలు చెప్పి, ఆమె మెడలో బంగారు గొలుసు చోరీ చేశాడు. జిల్లా కేంద్రంలో ఈ ఘటన చోటు చేసుకుంది. స్థానికులు, పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపిన వివరాలు.. పట్టణంలోని ఆదర్శనగర్ కాలనీకి చెందిన శేఖమ్మ భర్త చనిపోవడంతో అమ్మతో కలిసి బీడీలు చేస్తూ జీవనం కొనసాగిస్తుంది. ఆదివారం వారింటికి గుర్తుతెలియని వ్యక్తి వచ్చి, నీకు బీడీపెన్షన్ కింద రూ.30 వేలు వచ్చాయని చెప్పాడు. అంతేకాకుండా ఆమెకు డబ్బులు ఇప్పిస్తానని చెప్పి, బైక్‌పై ఎక్కించుకుని స్థానిక ప్రైవేట్ స్కూల్ దగ్గర ఉన్న మీసేవ కేంద్రం వద్దకు తీసుకెళ్లాడు. ఆమెకు మాయమాటలు చెప్పి, మెడలో రెండు తులాల బంగారాన్ని తీసి ఇవ్వు..దానికి బదులు బరువు ఉన్న బంగారాన్ని ఇస్తానని చెప్పి రోల్డ్‌గోల్డ్ గొలుసు ఇచ్చాడు. ఇప్పుడే వస్తానని చెప్పి వెళ్లిపోయాడు. ఎంతసేపటి రాకపోవడంతో అనుమానంతో ఆమె గొలుసును పరిశీలించగా నకిలీదని తేలింది. దీంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ ఇద్దరు మృతి

సోన్: పురుగుల మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి తమ్మిశెట్టి శ్రీను(34) బతుకుదెరువు కోసం లక్ష్మణచాంద మండలం రాచాపూర్ గ్రామానికి వచ్చి కొన్నినెలలుగా తాపీ ఎమేస్త్రీగా పనిచేస్తున్నాడు. గ్రామంలో నూతన ఇళ్ల నిర్మాణం చేపట్టాడు. పట్టుకున్న ఇళ్లను పూర్తి చేయలేక, కూలీలు దొరకక ఆర్థికంగా ఇబ్బంది పడుతూ మనస్తాపం చెందాడు. శనివారం సోన్ మండలం న్యూవెల్మల్ గ్రామ శివారు సరస్వతీ కెనాల్ సమీపంలో గుర్తుతెలియని పురుగు ల మందు తాగాడు. స్థానికులు గమనించి అతన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు ఆసుపత్రికి పంపించారు. చికిత్స పొందుతూ ఆది వారం మృతి చెందాడు. భార్య శిరీష ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె.గోపి తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.


తమ్మిశెట్టి శ్రీను (ఫైల్)

హైదరాబాద్ నిమ్స్‌లో రైతు..

భీమారం: ఎడ్లబండిపై నుంచి జారి కిందపడ్డ గాయపడిన రైతు హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందు తూ మృతిచెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. మండలంలోని లాల్ బహదూర్‌పేటకు చెందిన రైతు కంకణాల మల్లారెడ్డి ప్రతిరోజు మాదిరి ఈనెల 15న పొలం వద్దకి ఎడ్లబండిపై వెళ్తుండగా అకస్మాత్తుగా జారి కిందపడి గాయాలయ్యాయి. గ్రామస్తులు గమనించి వెంటనే 108 సిబ్బందికి సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని అతన్ని మంచిర్యాల ఆసుపత్రికి తరలించారు. హైదరాబాద్ నిమ్స్‌కు తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. అక్కడ చికిత్సపొందుతూ ఆదివారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మి, కుమారుడు సతీశ్, కుమార్తె మానస ఉన్నారు.


కంకణాల మల్లారెడ్డి (ఫైల్)

అక్రమంగా తరలిస్తున్న డీజిల్ పట్టివేత

- 22న పోలీస్‌స్టేషన్‌లో వేలం

నేరడిగొండ: మండల పరిధిలో అక్రమంగా తరలిస్తున్న డీజిల్‌ను పోలీసులు పట్టుకున్నారు. మొత్తం 2,330 లీటర్ల డీజిల్‌ను స్వాధీనం చేసుకుని తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేశారు. ఈ విషయంలో అదనపు కలెక్టర్ (పౌర సరఫరాలు) చర్యలు చేపట్టారు. పట్టుకున్న డీజిల్‌తో ప్రభుత్వానికి ఆదాయంగా మార్చేందుకు వేలం పాట ద్వారా విక్రయించేందుకు ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 22న ఉదయం 11 గంటలకు నేరడిగొండ పోలీస్‌స్టేషన్‌లో వేలం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఎంఏ కలీమ్ తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఈ ఓపెన్ వేలంలో పాల్గొనాలని కోరారు.


పట్టుకున్న డీజిల్

అ'పూర్వ' సమ్మేళనం



మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం దొనబండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1991–92వ బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. 33 ఏళ్ల తర్వాత వీరి అపూర్వ సమ్మేళనానికి ఆ పాఠశాల వేదికైంది. ఒకరికొకరు ఆత్మీయ ఆలింగనం అనంతరం యోగా క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఉన్నత చదువులు చదివి వ్యాపారాలు, ఉద్యోగాలో వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా అపూర్వ సమ్మేళనంతో కలిసి గత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులతో ఆనంద క్షణాలు పంచుకున్నారు. పాఠశాల హెచ్ఎం హన్మాండ్లు, ఉపాధ్యాయులు రాములు, సత్యనారాయణ, రాజ్‌కుమార్, పూర్వ విద్యార్థులు బేతి శ్రీనివాస్, గుండ లచ్చయ్య, జాడి విజయ్, చంద్రశేఖర్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.